సాక్షి నిర్మల్

శుక్రవారం । 15 । మార్చి । 2024

I



వస్తుసేవల్లో నాణ్యత తప్పనిసరి

వస్తు వినిమయ వ్యవస్థలో వినియోగదారుడికే సర్వహక్కులు ఉంటాయి. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భ గా సాక్షి ప్రత్యేక కథనం..

IIలో▸



రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్ర: 6:27	శని: 5:02

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 37.6 /26.4

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమవుతుంది. పగలు వేడిగా, ఉక్కపోతగా ఉంటుంది. రాత్రి ఉష్ణోగ్రత కూడా పెరుగుతుంది.

న్యూస్‌రీల్

యాంత్రీకరణతో రైతులకు మేలు



డ్రోన్లను పరిశీలిస్తున్న కలెక్టర్

నిర్మల్‌చైన్‌గేట్: వ్యవసాయరంగంలో యాంత్రీకరణతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఇండియన్ ఫార్మర్స్ ఫర్టిలైజర్ కోఆపరేటివ్ లిమిటెడ్ (ఇఫ్కో)వారి వ్యవసాయ డ్రోన్‌ను గురువారం ప్రారంభించారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి ఎరువులను సులభతరంగా పిచికారీ చేసుకోవచ్చని తెలిపారు. మహిళా సాధికారిత సాధించేందుకు మహిళలకు వంద శాతం రాయితీతో ఈ డ్రోన్లను అందించడం అభినందనీయమన్నారు. గ్రామీణ యువత, మహిళలు, మహిళా సంఘాలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశంతో ఈ డ్రోన్లను సమకుర్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్, ఇఫ్కో ఎఫ్‌వో వికాస్, ఎస్ఎఫ్ఏ సాగర్, నవీన్ అధికారులు పాల్గొన్నారు.

జాతీయ కిడ్నీ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా జనరల్ ఆసుపత్రిలోని డయాలసిస్ కేంద్రంలో జాతీయ కిడ్నీ దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ జేవీడీఎస్.ప్రసాద్, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ సునీల్‌కుమార్ కేక్ కట్‌చేసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు జిల్లా జనరల్ ఆసుపత్రిలో 53,033 సెషన్ల ఉచితంగా డయాలసిస్ సేవలు అందించామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో గణేశ్ వైద్యులు శ్రీకర్, ముఖేష్, రవి పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ పరీక్షలు

- చివరి రోజు 229 మంది గైర్హాజరు

నిర్మల్ రూరల్: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు గురువారం ముగిశాయి. చివరిరోజు మొత్తం 5,854 మంది విద్యార్థులకు, 5,625 మంది పరీక్ష రాశారు. 2,29 మంది గైర్హాజరయ్యారు. జనరల్ కేటగిరీలో 5,135 మందికి 4,956 మంది పరీక్ష రాయగా, 179 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్ కేటగిరీలో మొత్తం 719 మంది విద్యార్థులకు 669 మంది పరీక్ష రాయగా 50 మంది గైర్హాజరయ్యారు. ఇది ఇలా ఉండగా... జిల్లాలో జవాబు మూల్యాంకనం కొనసాగుతోంది. జిల్లాకు వివిధ ప్రాంతాల నుండి వరుసగా జవాబు పత్రాలు వస్తున్నాయి. ప్రభుత్వ బాలుర కళాశాలలో స్పాట్ వాల్యుయేషన్ నిర్వహిస్తున్నారు. ఏప్రిల్ రెండో వారంలో ఫలితాలు వెలువడుతాయని అధికారులు పేర్కొన్నారు.

జూన్ 10 నాటికి స్కూల్ యూనిఫాంలు

నిర్మల్‌చైన్‌గేట్: వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంలు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లు, విద్యాశాఖ అధికారులతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ విద్యార్థుల స్కూల్ యూనిఫాంలు కుట్టే బాధ్యత మహిళా స్వయం సహాయక బృందాలకు అప్పగిస్తున్నమన్నారు. ఔత్సాహికులైన మహిళలను గుర్తించి వారికి యూనిఫాంలు కుట్టే బాధ్యత అప్పగించాలన్నారు. సెలవుల్లో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పాఠశాలల్లోని తరగతి గదులు, మరుగుదొడ్ల మరమ్మతులు చేపట్టాలన్నారు. పనులు చేసే కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపులో జాప్యం చేయొద్దని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఈవో రవీందర్‌రెడ్డి, డీఆర్డీవో విజయలక్ష్మి, సీపీవో మల్లికార్జున్, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్ పార్లమెంటరీ ముఖ్య నేతలతో మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్



సక్కుకే 'కారు' టికెట్

- రాజధానిలో పార్లమెంటరీ సమావేశం
- అనంతరం ప్రకటించిన గులాబీ బాస్
- ఇక ప్రజాక్షేత్రంలోకి వెళ్లాలని పిలుపు
- గెలుస్తామని పార్టీ క్యాడర్‌కు భరోసా

సాక్షి, ఆదిలాబాద్: బీఆర్ఎస్ ఆదిలాబాద్ లోకసభ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు పేరు ఖరారైంది. ఆ పార్టీ అధినేత కేసీఆర్ గురువారం పార్లమెంటరీ సమావేశం అనంతరం అభ్యర్థిని ప్రకటించారు. ముందునుంచీ పార్టీలో చర్చ సాగుతున్నట్లుగానే సక్కునే బరిలోకి దింపారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న సక్కుకు గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ టికెట్ దక్కలేదు. అధినేత కేసీఆర్ అప్పట్లోనే పార్లమెంట్ ఎన్నికల్లో ఆదిలాబాద్ అభ్యర్థిగా అవకాశం కల్పిస్తానని హామీ ఇచ్చారు. దీంతో అప్పుడు ఆసిఫాబాద్ అభ్యర్థినిగా పోటీ చేసిన కోవ లక్ష్మికి సక్కు పూర్తి మద్దతు ఇచ్చి గెలిపించడంలో ప్రధానపాత్ర వహించారు. దీంతో కేసీఆర్ ఇచ్చిన మాట నిలుపుకొంటూ సక్కును ఆదిలాబాద్ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

రెండుసార్లు ఎమ్మెల్యేగా..

ఆత్రం సక్కు రెండుసార్లు కాంగ్రెస్ నుంచి ఆసిఫాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2009లో మొదటిసారి, ఆ తర్వాత 2018లో మరోసారి హస్తం గుర్తుపై విజయం సాధించారు. రెండోసారి గెలుపొందిన తర్వాత ఆయన బీఆర్ఎస్‌లో చేరి కొనసాగుతున్నారు. కాగా, 2008లో ప్రభుత్వ ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన ఆత్రం సక్కు మరుసటి ఏడాది కాంగ్రెస్ అభ్యర్థిగా ఆసిఫాబాద్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. కాగా, ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి 2014, 2019 ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థిగా గోడం నగేశ్ బరిలో నిలిచారు. రెండు పర్యాయాల తర్వాత బీఆర్ఎస్ అధిష్టానం అభ్యర్థిని మార్చింది. ఈ పార్లమెంట్ స్థానం నుంచి 2008లో టీ మధుసూదన్‌రెడ్డి, 2014లో గోడం నగేశ్ బీఆర్ఎస్ నుంచి గెలుపొందారు. కాగా, బీజేపీ అభ్యర్థిగా ఎంపికైన గోడం నగేశ్, ప్రస్తుతం బీఆర్ఎస్ అభ్యర్థిగా ఎంపికైన ఆత్రం సక్కు ఇరువురు గోండు సామాజిక వర్గానికి చెందినవారే. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక ఎలా ఉంటుందనేదానిపై అందరి దృష్టి ఉంది.

సమావేశం తర్వాతే నిర్ణయం

బీఆర్ఎస్ ఆదిలాబాద్ పార్లమెంటరీ సమావేశం గురువారం హైదరాబాద్‌లో జరిగింది. మాజీ సీఎం కేసీఆర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్లమెంట్ పరిధిలోని ముఖ్య నేతలు హాజరయ్యారు. సమావేశంలో అభ్యర్థి ఎంపికకు సంబంధించి ముఖ్యనేతలు కేసీఆర్ నిర్ణయానికే వదిలేశారు. ఏ నిర్ణయానికైనా తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. కాగా, సాయంత్రం అభ్యర్థి ప్రకటన వెలువడింది.

మాజీ మంత్రి అల్లోల, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి గైర్హాజరు

హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని ముఖ్యనేతలు, మాజీ మంత్రులు జోగు రామన్న, వేణుగోపాలాచారి, ఎమ్మెల్యేలు అనిల్‌జాదవ్, కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, సీనియర్ నాయకులు అరిగెల నాగేశ్వర్ రావు, రవీందర్‌రావు, వీ సత్యనారాయణగౌడ్, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, నేతలు భూక్యా జాన్సన్‌నాయక్, రమాదేవి, కిరణ్‌కుమార్, జెడ్పీ మాజీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, రాంకిషన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అయితే మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి సమావేశానికి గైర్హాజరు కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. వీరు పార్టీ మారుతున్నారని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో సమావేశానికి రాకపోవడం ఇందుకు మరింత బలాన్ని చేకూర్చింది. కాగా, ఇప్పటివరకు ఆదిలాబాద్ పార్లమెంట్‌లో గులాబీ పార్టీ బలంగా ఉన్నట్లు కేసీఆర్ సమావేశంలో దిశానిర్దేశం చేశారు. గట్టిగా పోరాడితే ఈ స్థానం గెలుస్తామని భరోసా ఇచ్చారు.



ఆత్రం సక్కు బయోడేటా

- పేరు : ఆత్రం సక్కు
- తల్లిదండ్రులు : మాన్కుబాయి, రాజు
- జననం : 2.1.1973
- భార్య : తులసి (ప్రభుత్వ ఉపాధ్యాయురాలు–టీడబ్ల్యూపీఎస్)
- కుమారులు : వినోద్, అంకిత్, అన్వేశ్
- కూతుళ్లు : దివ్యభారతి, హిమబిందు, జంగుబాయి
- వయస్సు : 51 సంవత్సరాలు
- విద్యార్హత : ఇంటర్మీడియట్
- కులం : ఎస్టీ (గోండు)
- వృత్తి : వ్యవసాయం
- చిరునామా : లక్ష్మీపూర్ గ్రామం, గిన్నెధరి గ్రామపంచాయతీ, తిర్యాణి మండలం, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా.

ముహూర్తం ఎప్పుడో..!

- కేసీఆర్‌తో భేటీకి 'అల్లోల', విఠల్‌రెడ్డి డుమ్మా
- ఆరా తీసిన మాజీ ముఖ్యమంత్రి
- 19న కాంగ్రెస్‌లో చేరే ఛాన్స్?

నిర్మల్: మాజీమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విఠల్‌రెడ్డి కారు దిగడం ఖాయమైంది. కాంగ్రెస్‌లో చేరడం మాత్రమే మిగిలింది. బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ హైదరాబాద్‌లో గురువారం నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని నాయకుల భేటీకి ఈ ఇద్దరూ డుమ్మా కొట్టారు. దీంతో పార్టీ మార్పుపై క్లారిటీ వచ్చింది. నేడో రేపో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ ఉంటుందని తెలుస్తోంది. అన్నీ కుదిరితే ఈనెల 19న కాంగ్రెస్ కండువా వేసుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నిర్మల్‌లోనే సభ ఏర్పాటు చేసి పార్టీలో చేరాలని యోచిస్తున్నట్లు సమాచారం.

కేసీఆర్‌తో భేటీకి దూరం..

బీఆర్ఎస్ ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఖరారు నేపథ్యంలో హైదరాబాద్‌లో గురువారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఇందులో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోనే పార్టీకి చెందిన సీనియర్ నేతలంతా పాల్గొన్నారు. కానీ.. మాజీ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి మాత్రం హాజరు కాలేదు. ఇంద్రకరణ్‌రెడ్డి ఎందుకు రాలేదని ఈ సందర్భంగా కేసీఆర్ ప్రశ్నించగా, పర్సనల్ పని ఉండటంతో రాలేకపోయారని అనుచరులు చెప్పినట్లు తెలిసింది. ఈ సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధి నుంచి ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండె విఠల్, కేంద్రమాజీ మంత్రి వేణుగోపాలాచారి, మాజీ ఎమ్మెల్యేలు ఆత్రం సక్కు, జోగు రామన్న, సత్యనారాయణగౌడ్, లోలం శ్యాంసుందర్, అరిగెల నాగేశ్వర్‌రావు, రవీందర్‌రావు, జాన్సన్‌నాయక్, డాక్టర్ కిరణ్‌కొమ్రెవార్, విలాస్‌గాదేవార్, జెడ్పీటీసీ సభ్యులు జానుబాయి, చారులత, రమాదేవి తదితరులు హాజరయ్యారు.

నేడో రేపో సీఎంతో సమావేశం

బీఆర్ఎస్ మీటింగ్‌కు డుమ్మాకొట్టిన అల్లోల, విఠల్‌రెడ్డి నేడో రేపో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలువనున్నట్లు తెలిసింది. కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి దీపదాస్‌మున్షీ సమక్షంలో హస్తం తీర్థం పుచ్చుకునే అవకాశం ఉన్నా సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలోనే చేరాలని అనుకుంటున్నారని సమాచారం.

వ్యతిరేకత వస్తున్నా..

అల్లోల, విఠల్‌రెడ్డిలను కాంగ్రెస్‌లోకి తీసుకోవద్దని హస్తం శ్రేణులు వ్యతిరేకత వ్యక్తంచేస్తున్నా.. చేరికల దిశగా చర్యలు, చర్చలు కొనసాగుతూనే ఉన్నాయి. ప్రధానంగా డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు అల్లోల రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఇంద్రకరణ్‌రెడ్డి రాకను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. కానీ.. ప్రస్తుతం ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ పరిస్థితులను దృష్టిలో పెట్టుకున్న కాంగ్రెస్ ఇతర పార్టీల సీనియర్ నేతల చేరికలకు అడ్డుచెప్పదనే రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కేసీఆర్‌ను కలిసిన నాయకులు



కేసీఆర్‌తో నిర్మల్ బీఆర్ఎస్ నాయకులు

నిర్మల్‌టౌన్: నిర్మల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ముఖ్య నేతలు మాజీ సీఎం కేసీఆర్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో గురువారం కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ సమష్టిగా పనిచేస్తూ.. పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కేసీఆర్‌ను కలిసినవారిలో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, నిర్మల్ ఎంపీపీ రామేశ్వర్‌రెడ్డి, మాజీ డీసీసీబీ చైర్మన్ రాంకిషన్‌రెడ్డి, నాయకులు డాక్టర్ సుభాష్‌రావు ఉన్నారు.

నేడు ఉమ్మడి జిల్లా అధికారులతో మంత్రి సీతక్క సమీక్ష

కైలాస్‌నగర్: రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క శుక్రవారం ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ మేరకు షెడ్యూల్ వివరాలను కలెక్టర్ రాజర్షి షా గురువారం ప్రకటించారు. ఉదయం 10గంటలకు కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం జోడేఘాట్ నుంచి మంత్రి బయలుదేరి 11.30గంటలకు ఉట్నూర్ డివిజన్ కేంద్రానికి చేరుకుంటారు. 12.30గంటల వరకు స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో పాల్గొంటారు. భోజన విరామ అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉట్నూర్ కేబీ కాంప్లెక్స్‌లోని పీఎమ్మార్సీ భవనంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో సమీక్షా నిర్వహిస్తారు. అనంతరం తిరిగి హైదరాబాద్‌కు వెళ్తారని కలెక్టర్ పేర్కొన్నారు.



విడిపోతున్నామని బాధతో స్నేహితులను ఆలింగనం చేసుకుని విద్యార్థిని కంటతడి



ప్రాణ స్నేహితులకు ఆత్మీయ వీడ్కోలు..

వీడలేమంటూ.. వీడిపోతూ..



ఇంటిబాట పట్టిన విద్యార్థులు

ఇన్ని రోజులు పుస్తకాలతో కుస్తీ పట్టిన ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థుల పరీక్షలు గురువారంతో పూర్తయ్యాయి. చివరి రోజు కావడం.. కళాశాలతో ఉన్న అనుబంధం ముగియడంతో విద్యార్థుల కళ్లు చెమర్చాయి. రెండేళ్లు హాస్టళ్లలో ఉండి చదువుకున్న విద్యార్థులు విడిపోతున్నందుకు బాధపడ్డారు. తల్లిదండ్రులు రావడంతో అన్నీ సర్దుకుని స్నేహితులకు వీడ్కోలు చెబుతూ ఇంటి బాట పట్టారు.

– సాక్షి ఫోటోగ్రాఫర్ నిర్మల్



ఇంటికి వెళ్తున్న సంతోషంలో ఆత్మీయంగా..

సర్కారు బడికి ఉచిత విద్యుత్..!

- మంచి నిర్ణయం అంటున్న ఉపాధ్యాయ సంఘాలు



భైంసాటౌన్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల కరెంట్ బిల్లులు ఏటికేడు పేరుకుపోతున్నాయి. పాఠశాలలకు నిర్వహణ నిధులు సకాలంలో రాకపోవడం, వచ్చిన నిధులు సరిపోకపోవడంతో కరెంట్ బిల్లులు సక్రమంగా చెల్లించడం లేదు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ఇతర ప్రభుత్వ విద్యాసంస్థల విద్యుత్ బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. పలుమార్లు విద్యుత్ సిబ్బంది కరెంట్ సరఫరా నిలిపేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత విద్యుత్ అందించాలని గతం నుంచే ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. కాగా, ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం గృహజ్యోతిలో భాగంగా తెల్ల రేషన్ కార్డుదారులకు 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ అందిస్తున్న విషయం తెలిసిందే. అయితే, ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలకు సైతం ఉచితంగా విద్యుత్ అందించాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి. ఈ మేరకు ఇటీవల జరిగిన ఆత్మీయ సమ్మేళనంలో సైతం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు ఉపాధ్యాయ సంఘాల నాయకులు పేర్కొన్నారు. దీంతో మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకుంటుందని సానుకూల హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వం సర్కారు బడులు, కళాశాలలకు ఉచిత విద్యుత్ అమలు చేస్తే ప్రయోజనం చేకూరుతుందని వారు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో వివిధ యాజమాన్యాల కింద 842 పాఠశాలలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వ, స్థానిక సంస్థల పాఠశాలలు 735, టీఆర్ఐఈఎస్ 01, ఆదర్శ పాఠశాల 01, కస్తూరిబా పాఠశాలలు 18, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు 05, గిరిజన సంక్షేమ పాఠశాలలు 62, బీసీ గురుకులాలు 07, మైనారిటీ గురుకులాలు 05, మదర్సాలు 07 ఉన్నాయి. అలాగే 12 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, గ్రంథాలయాలు కూడా ఉన్నాయి. మొత్తం జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ విద్యాసంస్థలకు సంబంధించి సుమారు 450 కిపైగా విద్యుత్ కనెక్షన్లు ఉండగా, దాదాపు రూ.2 కోట్ల వరకు విద్యుత్ బిల్లులు బకాయిలున్నట్లు విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

ఉచిత విద్యుత్ అందిస్తే ప్రయోజనం

ప్రభుత్వ పాఠశాలలకు ఉచితంగా విద్యుత్ అందించాలని గతం నుంచే కోరుతున్నాం. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ఆత్మీయ సమ్మేళనంలోనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు ప్రయోజనం చేకూరుతుంది.

– నరేంద్రబాబు, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు

ప్రభుత్వ అంగీకారం హర్షనీయం..

ప్రభుత్వ పాఠశాలలకు గృహజ్యోతి వర్తింపజేయాలని ప్రభుత్వానికి విన్నవించాం. నిర్వహణ నిధులు సరిపోక సకాలంలో బిల్లులు చెల్లించలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై ప్రభుత్వం దృష్టికి తేగా, అమలుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలుపడం హర్షనీయం.

– టి.నవీన్‌కుమార్, తపస్ జిల్లా అధ్యక్షుడు

మళ్లీ దీక్షకు వెనుకాడం

- బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- ఈనెల 20లోపు డీమార్ట్ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్

నిర్మల్‌చైన్‌గేట్: ఈనెల 20లోపు ప్రభుత్వ భూమిలో కట్టిన డీమార్ట్ అనుమతులు రద్దు చేయాలని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కలెక్టర్ స్పందించకుంటే కలెక్టరేట్ దగ్గర నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం మాట్లాడారు. దీనితోపాటు వెంకటాపూర్‌లో ప్రభుత్వ భూమి, అసైన్డ్ భూములలో అక్రమాలు, గాజులపేటలో శ్రీకృష్ణ దేవాలయానికి సంబంధించిన 8 ఎకరాల భూమి ఆక్రమణ, డీ1 పట్టాల పేరుతో జరిగిన అక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. చేసిన పాపాలు తప్పించుకునేందుకే పార్టీ మారే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఎన్ని పార్టీలు మారినా, ఎన్ని జిమ్మిక్కులు చేసినా ఇంద్రకరణ్‌రెడ్డిని విడిచిపెట్టే ప్రసక్తే లేదన్నారు. నరేంద్రమోదీ అందించిన సెంట్రల్ టర్మరిక్ బోర్డ్‌తోనే నేడు పసుపు క్వింటాల్ ధర రూ.20 వేల పైచిలుకు పలికిందన్నారు. ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద కేంద్రం ఇందిరమ్మ ఇండ్లకు సాయం అందిస్తోందన్నారు. అసెంబ్లీలో అడిగినట్లుగా ఇందిరమ్మ ఇండ్ల పథకంలో కేంద్రం బొమ్మ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోవడం సంతోషంగా ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 15న మల్కాజిగిరి, 16న నాగర్ కర్నూలు, 18న జగిత్యాలలో ప్రధాని నరేంద్ర మోదీ పర్యటిస్తారని తెలిపారు. సమావేశంలో బీజేపీ సీనియర్ నాయకులు రావుల రామనాథ్, అయ్యన్నగారి భూమయ్య, అంజుకుమార్‌రెడ్డి, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాదం అరవింద్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్వర్ రెడ్డి

అలేఖ్య కేసు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుకు ఇవ్వాలని వినతి

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలోని అలేఖ్య అనే యువతిని హత్యచేసిన ప్రేమోన్మాది శ్రీకాంత్ కేసును ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించారు. హైదరాబాద్‌లో సీఎంను బుధవారం రాత్రి కలిసి ఈ మేరకు విన్నవించారు. అనంతరం ఆదివాసీ, లంబాడా కార్పొరేషన్లు ఏర్పాటు చేసినందుకు సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఉన్నారు.



సీఎంకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డులో చోటు


రికార్డు ప్రతిని అందిస్తున్న ఎమ్మెల్యే

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన అభిలాష్–పూజ దంపతుల కుమారుడు కశ్విక్ ఎనిమిది నెలల వయసులో బాల మేధావిగా అబ్బురపరుస్తున్నాడు. తన తల్లి పూజ పేర్లు చెప్పిన 300 వస్తువులను గుర్తించి తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు దక్కించుకున్నాడు. ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డుకు సైతం దరఖాస్తు చేసుకోగా త్వరలోనే నిర్వాహకుల నుంచి రికార్డ్ పత్రం రానున్నట్లు తల్లిదండ్రులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్ ప్రతిని బాలుని తల్లిదండ్రులకు అందించారు.

ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు

ఆదిలాబాద్‌రూరల్: ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని యాపల్‌గూడ సమీపంలో బుధవారం ఆటో బోల్తా పడింది. మత్తడిగూడకు చెందిన ఆటోడ్రైవర్ రాంషావ్ పలువురు ప్రయాణికులను ఎక్కించుకుని బంగారుగూడ నుంచి మత్తడిగూడకు బయలుదేరాడు. యాపల్‌గూడ సమీపంలో అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న ఇంతియాజ్‌కు తీవ్రంగా పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఇంతియాజ్ ఖానం కూతురు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దేశీదారు పట్టివేత


పట్టుకున్న దేశీదారుతో ఎస్సై

తానూరు: మండలంలోని ఝరి(బి) గ్రామంలో అక్రమంగా దేశీదారు అమ్ముతున్న వ్యక్తిని గురువారం రాత్రి పోలీసులు అరెస్టు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు. గ్రామానికి చెందిన అమీర్‌రావు కొంతకాలంగా మహారాష్ట్ర నుంచి దేశీదారు తీసుకువచ్చి గ్రామంలో అధిక ధరలకు విక్రయిస్తున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు గురువారం రాత్రి పోలీసులు దుకాణంలో దాడి చేసి 21 దేశీదారు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఎక్సైజ్ శాఖ అధికారులకు కేసు అప్పగించనున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత


చింతల్‌చాందలో పట్టుకున్న ట్రాక్టర్

లక్ష్మణచాంద: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని చాంతల్‌చాంద గోదావరి నుంచి ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం ట్రాక్టర్ యజమాని నాగన్నపై కేసు నమోదు చేశారు. ఎస్సై మాట్లాడుతూ అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిర్మల్ : సారంగాపూర్ మండలం మలక్‌చించోలి శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను గురువారం రెవెన్యూ అధికారులు పట్టుకుని పోలీస్‌స్టేషన్ తరలించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వస్తుసేవల్లో నాణ్యత తప్పనిసరి

వస్తు వినిమయ వ్యవస్థలో వినియోగదారుడికే సర్వహక్కులు ఉంటాయి. కొనే ప్రతి వస్తువులోనూ, సేవలోనూ లోపం లేకుండా సరైన ధర, తూకం, నాణ్యత, స్వచ్ఛత కలిగినవి పొందే హక్కు వినియోగదారుడికి ఉంది. కానీ ప్రస్తుత కాలంలో మోసాలు ఎక్కువయ్యాయి. తూనికలు, కొలతల్లో భారీగా తేడాలు ఉంటున్నాయి. వీటిపై ఎవరైనా ప్రశ్నిస్తే, నిలదీస్తే తప్ప న్యాయం జరగడం లేదు. వస్తుసేవల్లో నాణ్యత కొరవడినా, నష్టపోయినా.. ఆధారాలతో ఫిర్యాదుచేస్తే తగిన పరిహారం పొందవచ్చు. నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం..


జిల్లా కేంద్రంలోని ఓ మాల్‌లో నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు

- వస్తువు తయారీలో ప్రమాణాలు పాటించాల్సిందే
- కొనుగోలు సమయంలో అప్రమత్తత అవసరం
- ఫిర్యాదుల కోసం వినియోగదారుల ఫోరమ్
- నేడు ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

నిర్మల్‌ఖిల్లా/పాతమంచిర్యాల: 1983 నుంచి ఏటా మార్చి 15న ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం నిర్వహించుకుంటున్నాం. మనదేశంలో వినియోగదారుల హక్కుల పరిరక్షణకు 1986లో రూపొందించిన చట్టం డిసెంబర్ 24, 1987 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. 2019 చట్టంతో దాన్ని మరింత పటిష్ట పరిచారు. కేంద్ర రక్షణ ప్రాధికార సంస్థ కూడా 2020లో ఏర్పాటైంది. వినియోగదారుల సౌలభ్యం కోసం వివిధ స్థాయిలో కమిషన్లు ఏర్పాట్లు చేశారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో కమిషన్లు పని చేస్తున్నాయి.

చట్టంలోని అంశాలు ఇవీ...

భారత ప్రభుత్వం 1986లో వినియోగదారుల రక్షణకు ఒక విప్లవాత్మకమైన చట్టాన్ని తెచ్చింది. అదే వినియోగదారులు హక్కుల పరిరక్షణ చట్టం. ఈ చట్టాన్ని అమలు చేయడానికి ప్రభుత్వం 'రీడ్రసల్ ఫోరమ్స్'ను ప్రతీ జిల్లా కేంద్రంలోను ఏర్పాటు చేశారు. ఇవి జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయి ఫోరమ్స్‌గా విభజించారు. జిల్లా స్థాయి కేంద్రానికి రిటైర్డ్ జిల్లా జడ్జి అధ్యక్షుడిగా, మరో ఇద్దరు మెంటర్లుగా ఉంటారు. మెజారిటీ కమిటీ సభ్యుల ఆమోదంతో ఫోరంలోని కేసులపై తీర్పు ఇస్తారు. వస్తువు లేదా సేవ విలువ, కోరే నష్ట పరిహారం రూ.లక్ష వరకు అయితే కోర్టు ఫీజు రూ.100, రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు రూ.200, రూ.10 లక్షల వరకు రూ.400, రూ.10 లక్షల పైన అయితే రూ.500 నామమాత్రపు కోర్టు ఫీజు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా వినియోగదారుల కమిషన్‌లో ఫిర్యాదు చేసిన తర్వాత ఫిర్యాదుదారుడు, ప్రతివాదుల మధ్యవర్తిత్వం నడిపి పరిష్కరించడానికి కృషి చేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇది అందుబాటులో ఉంది. జిల్లా వినియోగదారుల కమిషన్ తీర్పును 45 రోజుల లోపల రాష్ట్ర కమిషన్‌కు అప్పీలు చేసుకోవచ్చు. జిల్లా కమిషన్ తీర్పును అనుసరించి వ్యాపారి, విక్రయదారుల ఆస్తులు జప్తు చేసే అధికారం ఉంటుంది. వస్తువులను అమ్మినవారు, డీలర్, ఉత్పత్తిదారులు ఇందులో బాధ్యులవుతారు.

కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ

జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో వినియోగదారుల కమిషన్ తోడుగా కేంద్ర వినియోగదారుల పరిరక్షణ సంస్థ చట్టంలో ఉన్న ముఖ్యమైన భాగం ఆన్‌లైన్, ఈ మెయిల్ ద్వారా, రాతపూర్వకంగా నేరుగా సంస్థకు ఫిర్యాదు చేయవచ్చు. పరిష్కరించిన కేసును జాతీయ కమిషన్‌లో మాత్రమే అప్పీల్‌కు అవకాశం ఉంటుంది. టోల్‌ఫ్రీ నంబర్ 18004250626 లేదా ఉమ్మడి జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ ఆదిలాబాద్ కార్యాలయం, 08732–22078లో సంప్రదించవచ్చు .

ఫిర్యాదు ఎప్పుడు చేయాలంటే?

ఒక వ్యాపారి, డీలర్ ద్వారా గానీ వినియోగదారుడు నష్టపోయి ఉంటే సదరు వ్యక్తిపై లేదా సంస్థపై ఫిర్యాదు చేయవచ్చు. వస్తువులో లేదా ప్రొడక్ట్ ఒకటి అంతకంటే ఎక్కువ లోపాలు ఉన్నప్పుడు సర్వీసు విషయంలో డీలర్ అశ్రద్ధ చేసేటప్పుడు, అసలు ధర కంటే ఎక్కువ వసూలు చేసినప్పుడు, ఇతర విధంగా నష్టపోయినా ఫిర్యాదు చేయవచ్చు.

హక్కుల గురించి తెలుసుకోవాలి



వినియోగదారుడు వస్తువును కొనుగోలు చేసే ముందు నాణ్యతను పరిశీలించాలి. తప్పనిసరిగా బిల్లు తీసుకోవాలి. నాసిరకం వస్తువులపై, మోసపూరిత వ్యాపారులపై వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించడానికి వెనుకాడవద్దు. ప్రతిఒక్కరూ తమకున్న హక్కుల గురించి తెలుసుకోవాలి. మోసాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలి. ఉమ్మడి జిల్లా కేంద్రంలో వినియోగదారుల ఫోరం ఉంది. నిర్మల్, మంచిర్యాల, కుమురంభీం జిల్లా కేంద్రాల్లో కూడా ఏర్పాటుచేస్తే సత్వర న్యాయం మరింత అందుబాటులోకి లభిస్తుంది.

– సింగరి లింగయ్య, న్యాయవాది, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, నిర్మల్

పోస్టల్ అధికారిపై చర్యలు తీసుకోవాలి

- ఎమ్మెల్యే పాయల్ శంకర్


పోస్టల్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: రైతుల డబ్బులను తన ఖాతాలోకి మళ్లించుకున్న పోస్టల్ అధికారి జాదవ్ విజయ్ కుమార్ పై చర్యలు తీసుకోవాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని హెడ్ పోస్ట్ ఆఫీస్‌లో ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న జాదవ్ విజయ్ కుమార్ రైతుల ఖాతాల నుంచి డబ్బులను తన ఖాతాలోకి జమ చేసుకున్నారని రైతులు గురువారం నిరసన చేపట్టారు. వారికి మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యే పాయల్ శంకర్ ఈ విషయమై పోస్టల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సదరు మేనేజర్‌ను అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు అధైర్య పడవద్దని, డబ్బులు రికవరీ అయ్యేంత వరకు వారికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. శుక్రవారం పోస్టల్ అధికా రుల బృందం విచారణకు రానున్నట్లు తెలి పారు.

పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశానికి లక్కీడ్రా

ఉట్నూర్‌రూరల్: 2024–25 విద్యా సంవత్సరానికి గానూ హైదరాబాద్‌లోని బేగంపేట, రామంతపూర్ పబ్లిక్‌స్కూల్‌లో ఒకటో తరగతిలో ప్రవేశానికి ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో తల్లిదండ్రుల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా ఆరుగురు విద్యార్థులను ఎంపిక చేసినట్లు డీడీ దిలీప్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో పీవో ఖుష్బూ గుప్తా, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

15 మంది సీఐలు బదిలీ

మంచిర్యాలక్రైం: మల్టీజోన్–1 పరిధిలో పని చేస్తున్న 15మంది సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఐజీ రంగనాథ్ బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు సీఐలు ఉన్నారు.



పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఐ.సైదారావ్	వెయిటింగ్ మల్టీ జోన్–1	ఖానాపూర్
డీ. మోహన్	ఖానాపూర్	శ్రీరాంపూర్
టీ.బన్సీలాల్	శ్రీరాంపూర్	మంచిర్యాల
ఎస్‌పీ.రవీందర్	మంచిర్యాల	సీసీఎస్ కరీంనగర్
పీ.ప్రసాద్	వెయిటింగ్ మల్టీజోన్–1	డీసీఆర్‌బీ ఆదిలాబాద్
సీహెచ్.నటేష్	డీసీఆర్‌బీ ఆదిలాబాద్	మల్టీజోన్–1 కార్యాలయం

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

తలమడుగు(బోథ్): మండలంలోని బరంపూర్ గ్రామ సమీపంలోని కొండపైన తెలంగాణ తిరుపతిగా పిలిచే శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయంలో గోపాలకృష్ణ మఠాధిపతి స్వామి యోగానంద సరస్వతి, బీజేపీ నాయకురాలు చిట్యాల సుహాసిని ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కొండపై నుంచి గ్రామ పురవీధుల గుండా స్వామివారి రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. ఈ సందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహకార సంఘం చైర్మన్ దామోదర్ రెడ్డి, ఆలయ కమిటీ అధ్యక్షుడు కేదేరేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ రమేశ్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


ఆలయంలో పూజలు చేస్తున్న చిట్యాల సుహాసిని

చికిత్స పొందుతూ ఒకరు మృతి

ఆదిలాబాద్‌రూరల్: మావల మండల కేంద్రంలో ఈ నెల 9న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై వంగ విష్ణువర్ధన్ తెలిపారు. గుడిహత్నూర్ మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన భరత్ (23), శీను, కైలాస్ ద్విచక్ర వాహనంపై సీతగొంది వైపు నుంచి ఆదిలాబాద్ వైపు వస్తుండగా మావల గ్రామంలో ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్‌కు వెళ్లే రోడ్డు మార్గం సమీపంలో టిప్పర్‌ను ఢీకొట్టడంతో భరత్‌కు తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుని తండ్రి నాగోరావ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మహిళను మోసగించిన వ్యక్తికి ఏడాది జైలు

ఖానాపూర్: మహిళను మోసగించిన కేసులో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్షతో పాటు రూ.2వేల జరిమానా విధిస్తూ ఖానాపూర్ ప్రథమశ్రేణి న్యాయమూర్తి జితిన్‌కుమార్ గురువారం తీర్పునిచ్చినట్లు జిల్లా కోర్టుల సమన్వయ అధికారి సక్రియనాయక్ తెలిపారు. మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన శ్యామలను జగిత్యాల జిల్లా కోతపూర్ గ్రామానికి చెందిన తాల్లపెల్లి రాజేశ్‌శ్యామ్ 2018లో పెళ్లి చేసుకుంటానని చెప్పి మోసగించాడు. దీనిపై బాధితురాలు ఖానాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్సై వినయ్ కేసు నమోదు చేశారు. ఏపీపీవో రామకృష్ణ తొమ్మిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువుకావడంతో జడ్జి పైవిధంగా తీర్పునిచ్చినట్లు ఆయన పేర్కొన్నారు.

కందకాల పరిరక్షణ దిశగా..

- గజ్‌గఢ్ వద్ద ఆక్రమణలపై కదలిక


ట్రెంచ్ కొట్టిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

నిర్మల్: కందకాలు ఖతం.. అంటూ చరిత్ర కందకాలు, కట్టడాల కబ్జాలపై పలుమార్లు 'సాక్షి' కథనాలతో ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చింది. ఈక్రమంలో రెండు నెలల క్రితమే కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్పందించారు. జిల్లాలో చెరువులు, జలవనరుల పరిరక్షణ కోసం లేక్ కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ ప్రతినెలా సమావేశమవుతూ ఆక్రమణలపై చర్యలు తీసుకుంటోంది.

గజ్‌గఢ్ కందకం రక్షణకు..

ప్రియదర్శినినగర్‌లో ఎస్ఆర్ .డీజీ స్కూల్ వెనుకగల గజ్‌గఢ్ కందకం మొత్తాన్ని మూసివేసి ఆక్రమించేందుకు ప్రయత్నం చేశారు. దీనిపై జనవరి 24నే 'కందకం ఖతం..' శీర్షికన 'సాక్షి'లో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం గజ్‌గఢ్ చుట్టూ ఉన్న కందకాన్ని కాపాడే దిశగా చుట్టూ ట్రెంచ్ కొట్టించారు. ఇందులో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు. చెరువులు, జలవనరుల పరిరక్షణ కోసం లేక్ కమిటీ చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు.

'పార్టీ నిర్ణయానికి కట్టుబడి ఉందాం'


రాథోడ్ రమేశ్, మాజీ ఎంపీ

ఖానాపూర్: ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఎంపికపై పార్టీ తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉందామని మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ అన్నారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. పార్టీ అధిష్టానం తనపై నమ్మకంతో ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించిందని తెలిపారు. కొద్దిపాటి తేడాతో తాను ఓడిపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ప్రధాని నరేంద్రమోదీ కుటుంబ సభ్యులుగా ఈసారి సమష్టిగా ఆదిలాబాద్ ఎంపీ సీటు గెలుపే లక్ష్యంగా ముందుకు వెళ్దామన్నారు. పార్టీ శ్రేణులెవరూ నిరాశ, నిస్పృహలకు లోనుకావొద్దన్నారు. పార్టీ కార్యకర్తలే తన బలం బలగం అని పేర్కొన్నారు. బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా తాను అందరికీ అందుబాటులో ఉంటూ కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని, పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని తెలిపారు.

ఢిల్లీ సదస్సులో ట్రిపుల్‌ఐటీ వీసీ


మాట్లాడుతున్న వీసీ వెంకటరమణ

భైంసా: న్యూఢిల్లీలో ఇండియా డిడిక్టిక్స్ అసోసియేషన్ నిర్వహిస్తున్న ఎమర్జింగ్ బిగ్‌సిట్ భారత్ 2047 ఉన్నత విద్యావిధాన మార్పిడి సదస్సులో ట్రిపుల్ ఐటీ వీసీ ప్రొఫెసర్ వెంకట రమణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల మేధావులను, ఆచార్యులను ఒకేచోట ఉంచి ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పలు రాష్ట్రాల్లో అమలు చేస్తున్న ఎడ్యుకేషనల్ పాలసీల గూర్చి ఈ సమావేశంలో చర్చించారు. ఇలాంటి సదస్సులతో ఉత్తమ ఫలితాలు వస్తాయని అన్నారు.

కరువు భత్యం అమలు చేయాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న బీడీ వర్కర్స్ యూనియన్ నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్: ఏప్రిల్ నుంచి బీడీ కార్మికులకు పెరిగిన కరువు భత్యం అమలు చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియ న్ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న కోరారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్నిరకాల కేటగిరీల, కార్మికులు, బీడీ ప్యాకర్స్ బీడీ చాటర్స్ గంపవాలా, బట్టి వాలా కార్మికులందరికీ ఏప్రిల్ 1 నుంచి కరువు భత్యం అమలు చేయాలని జిల్లా కేంద్రంలో కరపత్రాలను గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరిగిన కరువు భత్యం తెలంగాణ రాష్ట్రంలో ఏడు లక్షల మంది బీడీ కార్మికులకు వర్తి స్తుందని తెలిపారు. దీనిని వెంటనే అమలు చేయాలని బీడీ యాజమాన్యాలను డిమాండ్ చేశారు. కొన్ని బీడీ యాజమాన్యాలు పెరిగిన కరువు భత్యాన్ని కార్మికులకు అమలు చేయకుండా కుట్రలు చేసే విధానాన్ని మార్చుకోవాలన్నారు. కార్మికుల పొట్టకొడితే యాజమాన్యాలు తీవ్ర పరిణామాలు చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం

ఖానాపూర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా 16 కా ర్పొరేషన్లు ఏర్పాటుకే కేబినెట్ నిర్ణయించడం హర్షనీయమని కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. గురువారం మాట్లాడుతూ కులవృత్తులు, వివిధ కులాలకు ఆర్థికంగా అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వ నిర్ణయం గొప్ప పరిణామమన్నారు. సా మాజికవర్గాలకు కార్పొరేషన్లు ఏర్పాటు చేయ డం ద్వారా సమాజంలో అణగారిన వర్గాలను ముందుకు తీసుకెళ్లడంలో భాగమేనని పేర్కొన్నారు. ఆదివాసీ కార్పొరేషన్‌తోపాటు లంబా డా కార్పొరేషన్లు సైతం ఏర్పాటు చేయడాన్ని గిరిజన విభాగం ద్వారా స్వాగతిస్తున్నామని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా రాష్ట్ర మంత్రి మండలి నిర్ణయాలు తీసుకోవడం గొప్ప విషయమని అన్నారు.

పరుచుకున్న ఆహ్లాదం

వేసవికాలం ప్రారంభమైంది. మార్చి మొదటి వారం నుంచే ఎండల తీవ్రత మొదలైంది. వేడి నుంచి ఉపశమనం కోసం చెట్టునీడను ఆశ్రయించే కాలమిది. నిర్మల్ నుంచి భైంసా మార్గంలో దిలావర్‌పూర్ మండలంలోని సిర్గాపూర్ నుండి లోలం వరకు ఏపుగా పెరిగిన చెట్లు రోడ్డుపై వెళ్లే వారికి నీడనిస్తూ సేదతీరుస్తున్నాయి. మండు వేసవిలో పచ్చనిచెట్ల మధ్య ప్రయాణం మనసుకు ఆహ్లాదం కలిగిస్తోంది.



– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



క్లుప్తంగా

సీసీ రోడ్ల నిర్మాణానికి భూమి పూజ



సీసీ పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ పద్మ

లక్ష్మణచాంద: మండలంలోని కనకాపూర్ గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మంజూరైన రూ.20లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను ఎంపీపీ పద్మ స్థానిక నాయకులతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు అడ్వాల రమేష్, సుంకు ముత్తన్న, చిన్నయ్య, వేణుగౌడ్, శ్రీను పాల్గొన్నారు.

శుభ్రతపై దృష్టి సారించాలి

భైంసారూరల్: గ్రామ శుభ్రతపై దృష్టి సారించాలని డీపీవో శ్రీనివాసులు అన్నారు. గురువారం మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో పర్యటించారు. మురికి కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామంలో సేకరించిన చెత్తను తడి, పొడిగా వేరుచేసి ఎరువులను తయారు చేయాలన్నారు. ఆయన వెంట కార్యదర్శి గాయత్రి ఉన్నారు.

అరె కటిక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

కడెం: ఆరె కటిక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని మండల కేంద్రానికి చెందిన కోయల్‌కార్ సతీశ్, మిర్యాల్‌కార్ గంగేశ్వర్, అంజన్న, శివ, లక్ష్మణ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జాబితాలో అరె కటికలను విస్మరించడం బాధాకరమని, రాష్ట్రంలో పదిహేను లక్షలకుపైగా ఉన్న తమను గుర్తించి ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్నారు.

పొదుపు అలవర్చుకోవాలి

కుంటాల: స్వయం సహాయక సంఘాల మహిళలు పొదుపు అలవర్చుకోవాలని సీసీ పెంటన్న పేర్కొన్నారు. గురువారం మండలంలోని పెంచికల్ పాడ్ గ్రామంలో నిర్వహించిన గ్రామ సంఘ సమావేశంలో మాట్లాడారు. బ్యాంకు లింకేజీ, రుణాలు, చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. వీవో అధ్యక్షురాలు లక్ష్మి, వీవోఏ సంపత్ పాల్గొన్నారు.

బోనమెత్తిన కుర్రగూడెం



బోనాలతో మహిళలు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ పంచాయతీ పరిధిలోని కుర్రగూడెంలో పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం బోనాల పండుగ నిర్వహించారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్లతో ఆలయానికి చేరుకుని మట్టి కుండల్లో వండిన బోనాన్ని పోచమ్మకు నైవేద్యంగా సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

కడెంకు ఇద్దరు జేఎల్‌ఎంలు

కడెం: ప్రభుత్వం చేపట్టిన విద్యుత్‌శాఖ నియామకాల్లో భాగంగా మండలానికి ఇద్దరు జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం)లను కేటాయించినట్లు ఏఈఈ సుమన్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని లింగాపూర్‌కు ప్రేమ్‌కుమార్, ఉడుంపూర్‌కు తిరుపతిలను నియమించినట్లు తెలిపారు. ఇద్దరు జేఎల్‌ఎంలు ఏఈఈ సుమన్‌కుమార్‌కు జాయినింగ్ లేటర్‌లు అందజేసి గురువారం విధుల్లో చేరారు. ఇందులో సబ్ ఇంజినీర్ స్వాతి, లైన్‌మెన్‌లు సంతోశ్, ఓదెలు, నర్సయ్య ఉన్నారు.

అప్పు ఇప్పించాలని దీక్ష



దస్తురాబాద్: అవసరం నిమిత్తం అప్పుగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వటం లేదని గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన దీక్ష చేపట్టిన సంఘటన గురువారం మండలంలోని బుట్టాపూర్ గ్రామపంచాయతీలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని బుట్టాపూర్ గ్రామ పంచాయతీలోని చెన్నూర్ గ్రామానికి చెందిన కనగంటి మల్లేష్ 2019వ లో అదే గ్రామానికి చెందిన తిప్పని సతీశ్ అనే వ్యక్తి వద్ద అవసరం నిమిత్తం రూ.47,000 అప్పుగా తీసుకున్నాడు. తిరిగి డబ్బులను చెల్లించాలని అడుగగా వాయిదాలు పెడుతూ కాలయాపన చేస్తుడడంతో చివరికి డబ్బులు ఇవ్వనని చెప్పాడు. దీంతో బాధితుడు గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట ప్రాంసరి నోటు రాసిచ్చిన కాగితాన్ని ప్లెక్సీ చేయించి నిరసన దీక్ష చేపట్టాడు. సంఘటన స్థలానికి ఎస్సై యసిర్ ఆరాఫత్ చేరుకొని బాధితుడుని దీక్ష విరమించమని కోరగా అప్పు చెల్లించే వరకు దీక్ష కొనసాగిస్తానని పేర్కొన్నాడు.

ఆలస్యం.. ఆందోళన..!

- ధాన్యం వచ్చినా.. ప్రారంభం కాని కొనుగోళ్లు
- బహిరంగ మార్కెట్‌లోనే అధిక ధర



మొక్కజొన్నను అరబెట్టిన రైతులు



కుంటాలలో మొక్కజొన్న కటింగ్ చేస్తున్న కూలీలు

కుంటాల: వ్యయప్రయాసాల కోర్చి పండించిన పంట అమ్ముకునేందుకు రైతులకు ప్రతి ఏటా ఇబ్బందులు తప్పడం లేదు. సకాలంలో పంట దిగుబడులు వచ్చినా.. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటులో జాప్యం కావడంతో రైతుల పాలిట శాపంగా మారింది. చేసేదేమీ లేక దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితి వస్తుందని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం మొక్కజొన్న పంటచేతికొచ్చిన ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

18,750 ఎకరాల్లో పంటలు సాగు...

కుంటాల మండలంలోని యాసంగిలో 8,750 ఎకరాలకు 3,740 రైతులు మొక్కజొన్న పంటను సాగు చేశారు. జొన్న 2,036 ఎకరాలు, వరి 2,790 ఎకరాలు, నువ్వు180 ఎకరాలు, శనగ 113 ఎకరాల్లో సాగుచేశారు. మొక్కజొన్న ఇప్పటికే కోత దశకు వచ్చిన మక్కల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

రైతుల్లో ఆందోళన...

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై ఆలస్యం అవుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అసలు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తారో లేదో అన్న బెంగ రైతుల్లో నెలకొంది. ప్రతి ఏటా కుంటాల సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని అంబకంటి, కల్లూర్, ఓలా, కుంటాల గ్రామాలతో పాటు నర్సాపూర్(జి) మండలంలోని గొల్లమాడ గ్రామంలో ఏర్పాటు చేస్తారు. రైతులు మొక్కజొన్న నూర్పిడి చేయిస్తూ బిజీబిజీగా కనిపిస్తున్నారు. 50శాతానికి పైగా కోతలు పూర్తయ్యాయి. కొందరు రైతులు పీఏసీఎస్ కార్యాలయం ఎదుట మొక్కజొన్న రాసులను పోసి ఆరబెట్టారు. ప్రభుత్వం క్వింటాల్‌కు 2,010 మద్దతు ధర ఉండగా బహిరంగ మార్కెట్లో క్వింటాల్‌కు 2వేల నుంచి 2,100ఉంది. సకాలంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోతే రైతులు దళారులను ఆశ్రయించాల్సిన పరిస్థితులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. ఇకనైనా అధికారుల స్పందించి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

ఏటా ఆలస్యమే..



ఈసారి నాలుగున్నర ఎకరాల్లో మొక్క జొన్నపంట సాగుచేశా. ఆరంభంలో కత్తెర పురుగు బెడద ఉన్న అధికారుల సూచనలు పాటించడంతో ఆశించిన దిగుబడులు వచ్చాయి. ప్రతిసారి కొనుగోలు కేంద్రాలు ఏర్పాట్లు ఆలస్యం జరుగుతుంది. కొనుగోలు కేంద్రాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలి.

– కదం గణేష్ పటేల్, పెంచికల్ పాడ్

కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



మండలంలోని ఆయా గ్రామాల్లో యాసంగిలో రైతులు మొక్కజొన్న పంటలు అధిక మొత్తంలో సాగు చేశారు. కొనుగోలు కేంద్రాలు ఎక్కడ అవసరం అని ఉన్నతాధికారులకు నివేదికలు పంపాం. వారి సూచన మేరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుకు చర్యలు చేపడతాం. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తాం.

– నాగభూషణం, సీఈవో, కుంటాల

‘డబుల్’ కాలనీని సందర్శించిన ఎమ్మెల్యే

- కాలనీలోని అసౌకర్యాలపై ఆరా
- పూర్తిస్థాయి సౌకర్యాల కల్పనకు హామీ



కాలనీలో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

సాక్షి ఎఫెక్ట్..

ఖానాపూర్: పట్టణంలోని డబుల్ బెడ్‌రూం కాలనీలో నెలకొన్న అసౌకర్యాలపై గురువారం ×డబుల్≅ కాలనీలో సౌకర్యాలేవి.? శీర్షికన వచ్చిన కథనానికి స్పందించిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు స్థానిక మున్సిపల్ పాలక వర్గ సభ్యులతో పాటు అధికారులతో కలిసి కాలనీని సందర్శించారు. ఈ సందర్భంగా కాలనీలో నెలకొన్న సమస్యలను మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యంతో పాటు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు నందిరామయ్య, తదితరులు ఎమ్మెల్యేకు వివరించారు. కాలనీలోని పలు బ్లాక్‌లలో తాగునీరు రావడం లేదన్నారు. పలుచోట్ల తాగునీటి బోర్లు వేసినప్పటికీ గ్రౌండ్‌లెవెల్ వాటర్ సమస్య కారణంగా బోర్లు ఫెయిల్ అవుతున్నాయని, తాగునీటికి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. ఇది వరకు భవనాలు నిర్మించిన కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే కాలనీలో పనులు అసంపూర్తిగానే ఉన్నాయన్నారు. పనులు నాణ్యత లేదని తెలిపారు. ప్రధానంగా సెప్టిక్ ట్యాంకులు సరిపడా లేకపోవడంతో భవనానికి ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల లీకేజీలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. మున్సిపాలిటి నుంచి వాటర్ ట్యాంక్ ద్వారా తాగునీరు వస్తున్నప్పటికీ పైన భవనంలోకి వాటిని తీసుకెళ్లడం ఇబ్బందిగా మారిందన్నారు. రోడ్లు, డ్రైనేజీలు లేకపోవడం, సెల్‌ఫోన్ సిగ్నల్స్ సమస్య ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాలనీ ప్రజలు ఎటువంటి ఆందోళన చెందవద్దని అన్నారు. వెంటనే కాలనీలో సమస్యలు పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో నెలకొన్న సమస్యల అన్నింటిపై ప్రతిపాదనలు సిద్ధం చేసి తనతో పాటు జిల్లా అధికారులకు అందజేయాలని మున్సిపల్ కమిషనర్ మనోహర్, మున్సిపల్ ఏఈ తిరుపతి తదితరులను ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు కావలి సంతోష్, షబ్బీర్‌పాషా, జన్నారపు శంకర్, పరిమి సురేష్, నిమ్మల రమేశ్, నాయిని సంతోష్, తోట సత్యం, సలీంఖాన్, జంగిలి శంకర్, గుగ్లావత్ రాజునాయక్, ఆసీఫ్ అలీ ఉన్నారు.

ఖానాపూర్ సీఐగా సైదారావు



సీఐ సైదారావు

ఖానాపూర్: ఖానాపూర్ నూతన సీఐగా సైదారావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. మల్టీపుల్ జోన్ –1 నుంచి ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఖానాపూర్ సర్కిల్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఖానాపూర్ సీఐగా పనిచేస్తున్న మోహన్ మంచిర్యాల జిల్లా శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. అనంతరం నూతనంగా విధుల్లో చేరిన సీఐ ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జును క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎస్సై లింబాద్రి తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణ

నిర్మల్‌చైన్‌గేట్: హౌస్ హోల్డ్ సప్లైపై మహిళలకు అందించే ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఈడీఐఐ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సంతోష్ కుమార్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఈద్గాం ఐకేపీ సెంటర్‌లో ఆక్సెంచర్ ఇంటర్ పిన ర్షిప్ డెవలప్‌మెంట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియా వారి ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. శిక్షణ పొందిన మహిళలకు ట్రైనింగ్ సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీ బ్యాంక్ మేనేజర్ శిరీష్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

ఖానాపూర్: పట్టణంతో పాటు మండలంలోని పాత ఎల్లాపూర్, మస్కాపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు గురువారం భూమి పూజ చేశారు. మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో సైన్స్ ల్యాబ్ గది నిర్మాణానికి , అనంతరం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్ల నిర్మాణానికి, అంతకముందు మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో అదనపు గదుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. నాయకులు చిన్నం సత్యం, పుప్పాల స్వప్న, మాజిద్, జంగిలి శంకర్, గుగ్లావత్ రాజునాయక్, కావలి సంతోష్, గంగనర్సయ్య, షబ్బీర్‌పాషా, మడిగెల గంగాధర్, ఆరె గంగాధర్, జహీర్ అహ్మద్, మాసుల లక్ష్మీరాజం, చంద్రయ్య పాల్గొన్నారు.

స్నేహమేరా జీవితం.. స్నేహమేరా శాశ్వతం



అరటి ఆకులో భోజనం చేస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: స్నేహమేరా జీవితం– స్నేహమేరా శాశ్వతం అంటూ స్నేహానికి కొత్త భాష్యం చెప్పారు మండలం మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు. మండలంలోని మల్లాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదేళ్ల పాటు కలిసి చదువుకొని, ఆడుకొని పాడుకుని స్నేహ బంధాన్ని బలోపేతం చేసుకున్న విద్యార్థులు పదో తరగతి చదవడం పూర్తయి పరీక్షలు రాయనున్న నేపథ్యంలో గురువారం తమ స్నేహబంధం జీవితాంతం కొనసాగాలని పాఠశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఒకే విస్తరాకులో అందరు కలిసి భోజనం చేస్తూ ఒకరికొకరు గోరు ముద్దులు తినిపించుకుంటూ స్నేహం ఓ మధురమైన అనుభూతి అని చాటిచెప్పారు. సృష్టిలో నా అనేవారు బంధువులు లేని వారైన ఉంటారేమే గాని స్నేహితులు లేని వారుండరని, మరో మారు గుర్తు చేశారు. ఇందులో ప్రధానోపాధ్యాయుడు నాగన్న, ఉపాధ్యాయులు దత్తాద్రి, శ్రీనివాస్, వెంకటరమణ, ప్రకాష్ రావు, నారాయణ, సంగీత ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

సాయిబాబా ఆలయంలో పూజలు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రసిద్ధిగాంచిన గండి రామన్న సాయిబాబా ఆలయంలో గురువారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబా పల్లకి సేవ, హారతి తదితర పూజ కార్యక్రమాలు చేశారు. సాయి సేవా సంఘ సభ్యులు పొడెల్లి చిన్నయ్య, వెన్నెల చిన్నయ్య, రామ్ రమేష్, నారాయణ గౌడ్, గట్ల బాబు, చిట్టి పెల్లి గంగయ్య, రామకష్ణ, కళ్యాణ్ పాల్గొన్నారు.

అభిషేకాలు..

కుంటాల: మండలంలోని కల్లూర్‌లోని సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి కనిపించింది. బాబాకు మంగళ స్నానం, అభిషేకం, గోపూజ కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

పరీక్ష ప్యాడ్‌లు అందజేత

కడెం: మండలంలోని లింగాపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఫేర్‌వెల్ డేను గురువారం నిర్వహించారు. లింగాపూర్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ (లేవా) ఆధ్వర్యంలో 77మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు మల్లేశ్, అధ్యక్షుడు బొమ్మిడి మహేశ్వర్, ప్రధాన కార్యదర్శి గంగారాం, హెచ్ఎం వెంకటరమణ ఉన్నారు.

అధిష్ఠానం నిర్ణయం మేరకే నడుచుకుంటాం..

ముధోల్: అధిష్ఠానం నిర్ణయం మేరకే తాము పని చేస్తామని బీజేపీ జిల్లా సహకోశాధికారి భూమేష్ అన్నారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానానికి గేడం నగేష్‌ను అభ్యర్థిగా అదిష్ఠానం ప్రకటించిందని, ఆయన గెలుపునకు తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్‌లు స్వర్ణలత దత్తాత్రి, నిమ్మ పోతన్న, నాయకులు బాపురావు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తానూరు: చిన్నారులు, బాలింతలు, గర్భిణులు, కిషోర బాలికలు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనిత సూచించారు. మండలంలోని బోల్సా గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ పక్వాడలో భాగంగా పోషకాహారంపై అవగాహన కల్పించారు.

ఎంపీడీవోకు సన్మానం

ముధోల్: మండల ఎంపీడీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో రాములు నాయక్‌ను గురువారం బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలాభివృద్ధికి కృషి చేస్తానన్నారు. మాజీ సర్పంచ్ స్వర్ణలత దత్తాత్రి ఉన్నారు.

సీసీరోడ్ల నిర్మాణాలు ప్రారంభించిన జెడ్పీటీసీ

సారంగపూర్: మండలంలోని దుర్గానగర్, మహవీర్ తండాల్లో గురువారం జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి సీసీరోడ్ల నిర్మాణాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుర్గానగర్‌కు రూ.6లక్షలు, మహవీర్ తండాకు రూ.3లక్షల నిధులతో సీసీరోడ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, ఆయా గ్రామాల మాజీ సర్పంచ్ పవార్ తిరుమల, ఎంపీటీసీ సభ్యుడు రాజు ఉన్నారు.

ఆపదలో 100 డయల్ చేయండి

నిర్మల్‌టౌన్: ఎవరైనా వేధిస్తే ఆందోళన చెందకుండా 100కు డయల్ చేయాలని షీటీం పోలీసులు పేర్కొ న్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని శాంతినగర్‌లోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఇంటర్ పరీక్ష కేంద్రం వద్ద షీటీం బృందం ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. అవసరమైతే షీటీం ఎమర్జెన్సీ నెంబర్ 87126 59550 కు ఫోన్ చేయాలని సూచించారు.

వాటర్ ట్యాంక్ ఏర్పాటు

ఖానాపూర్: మండలంలోని బావాపూర్(ఆర్) గ్రామంలో రిలయన్స్ ఫౌండేషన్, డ్రీమ్ సొసైటీతో పాటు పలువురు గ్రామస్తుల ఆర్థిక సాకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ట్యాంక్‌ను గురువారం ప్రారంభించారు. గ్రామంలో 40 కుటుంబాలకు తాగునీటి సమస్య తీర్చాలంటే గద్దెను నిర్మించి ట్యాంకు ఏర్పాటు చేయాలని గ్రామస్తుల విన్నపం మేరకు సొసైటీ, ఫౌండేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. ఇందుకు గ్రామ వీడీసీ, తాజా మాజీ సర్పంచ్ మల్లేష్, తదితరులు సహకరించడంతో గ్రామంలో వాటర్ ట్యాంకు నిర్మాణం పూర్తయిందని వారు పేర్కొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

ముధోల్: ముధోల్ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. గురువారం మండలంలోని పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల అదనపు తరగతి గదులు, లాబరేటరీ నిర్మాణానికి భూమిపూజ చేశారు. రూ.2.30కోట్లతో ఈ పనులను నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలోని సమస్యలు, కల్పించాల్సిన వసతులపై పూర్తి సమాచారంతో నివేదిక ఇ వ్వాలని ఎంఈవోలకు సూచించారు. అనంతరం మండలంలోని బోరిగాం గ్రామంలో పొద్దు సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. డీఈవో రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో రాములునాయక్, పీఏసీ ఎస్ చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, మార్క్‌ఫెడ్ స్టేట్ డైరెక్టర్ గంగాచరణ్, జెడ్పీటీసీ సరోజిని సురేందర్‌రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

భైంసారూరల్: మండల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని ముధోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ అన్నారు. గురువారం మండలంలోని వాలేగాం గ్రామంలో రూ. 5 లక్షల జిల్లా పరిషత్ నిధులతో గ్రావెల్ రోడ్డు పనులకు భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు సోలంకి భీంరావు, బీజేపీ నాయకులు ఉన్నారు.

బాధితులను ఆదుకుంటాం

లోకేశ్వరం: మండలంలోని వట్టోలి గ్రామానికి చెందిన ఎగ్గం పెద్ద భూమన్న, ఎగ్గం సాయన్న ఇళ్లు కాలిపోవడంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గురువారం వారి కుటుంబాలను పరామర్శించారు. అన్ని విధాలా ఆదుకుంటామని తెలిపారు. బీజేపీ నాయకులు సంజీవ్‌రెడ్డి, సాయన్న, విలాస్, మంద గణేష్, వెంగల్‌రావు, నవీన్‌రెడ్డి ఉన్నారు.

ప్రారంభమైన ఇలేగాం జాతర



పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

భైంసారూరల్: మండలంలోని ఇలేగాం గ్రామంలో బాపూజీ మహారాజ్ జాతర ప్రారంభమైంది. గురువారం బాపూజీ మహారాజ్ ఆలయం నుంచి గ్రామంలో పల్లకి సేవ నిర్వహించారు. గ్రామస్తులు పల్లకి సేవలో పాల్గొన్నారు. మధ్యాహ్నం బాపూజీమహారాజ్ ఆలయానికి చేరుకున్నారు. జాతరలో మొదటి రోజు గురువారం ఆలయ ప్రాంగణంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జాతర సందడి...

బాపూజీ మహారాజ్ జాతర సందర్భంగా చిరు దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. రంగుల రాట్నాల్లో పల్లె ప్రజలు ఆనందంగా గడుపుతూ కనిపించారు. భక్తులకు ఇబ్బందులులేకుండా ఆలయ కమిటీ, గ్రామస్తులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

రెండు పంటలకు నీరందిస్తాం



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్

పెంబి: వ్యవసాయానికి రెండు పంటలకు సరిపడా నీరు అందించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని తాటిగూడ గ్రామ సమీపంలో కడెం వాగులో చెక్‌డ్యాం నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. చెక్‌డ్యాం నిర్మాణంతో భూగర్భజలాలు పెరుగుతాయని, దీంతో వ్యవసాయనికి అవసరమగు నీరు మోటార్ల ద్వారా అందించవచ్చన్నారు. అంతకుముందు గ్రామంలోని ప్రకాష్ మహారాజ్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యేకు స్థానిక నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఖానాపూర్ మున్సిపల్ చైర్పర్సన్ రాజుర సత్యం, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వప్నిల్ రెడ్డి ఉన్నారు.

‘ఆర్ఎస్పీ క్షమాపణ చెప్పాలి’



మాట్లాడుతున్న రామగిరి రవీందర్

నిర్మల్‌టౌన్: ధర్మసమాజ్ పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్‌పై విమర్శలు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ 48 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ పార్టీ జిల్లా ప్రచార కమిటీ సభ్యులు రామగిరి రవీందర్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. మహనీయులు కలలుగన్న రాజ్యం కోసం వేల కిలో మీటర్ల పాదయాత్రలు చేస్తున్న విశారదన్ మహారాజ్‌ను రాజకీయ సన్యాసం తీసుకోవాలనడం ఆర్ఎస్పీ దిగజారుడుతనాన్ని చూపిస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ ప్రజలకు భారత రాజ్యాంగ విలువలను బోధిస్తూ.. ఒక ఉన్నతమైన వ్యక్తిత్వం గల నాయకత్వాన్ని తయారు చేస్తే, వారిని రోబోలు, సైకోలు అనడం చేతకానితనమే అని మండిపడ్డారు. కార్యక్రమంలో పార్టీ ప్రచార కమిటీ సభ్యులు సిలారి శ్రీనివాస్, రాజు, కల్లూర్ సుధాకర్, సొన్న భూమేష్, కుందూరు వినోద్, కత్తి శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థులు

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10 తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పార్టీని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా ముందుగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు హరిప్రసాద్ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో పరీక్షలకు హాజరు కావాలన్నారు. ఎటువంటి భయం లేకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, ఉపాధ్యాయులు అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులు పరీక్షలకు భయపడొద్దు



విరాళం అందిస్తున్న పదో తరగతి విద్యార్థులు

భైంసాటౌన్: పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయం వీడాలని పాఠశాల ప్రబంధకారిణి సభ్యులు డాక్టర్ రాజరెడ్డి అన్నారు. పట్టణంలోని పులేనగర్ సుభద్రవాటిక శ్రీసరస్వతి శిశుమందిర్‌లో పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. అలాగే పదో తరగతి విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి రూ.48వేలు కమిటీ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ప్రబంధకారిణి సభ్యులు రమేష్ మాశెట్టివార్, శైలేష్, మెంచు గంగయ్య, డా నగేష్, రాజేశ్వర్, అడెపు శ్రీనివాస్ ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఖానాపూర్: పట్టణంలోని శ్రీశివభక్త మార్కండేయ ఆలయంలో గురువారం ఖానాపూర్ పద్మశాలి సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బిల్ల శంకర్, ప్రధాన కార్యదర్శిగా భిమనాథి నరేశ్, కోశాధికారిగా కట్టెకోల నర్సయ్య, గౌరవ అధ్యక్షుడిగా శంకర్, శ్రీనివాస్, భీమనాథి గంగరాజం , ఉపాధ్యక్షుడిగా గొండాల శ్రీనివాస్, బోగ కిషన్, సామల గంగాధర్, ప్రచార కార్యదర్శిగ బోగ రాజేశ్వర్, సహాయ ప్రచార కార్యదర్శిగా భోగ నాగరాజు, సహాయ కార్యదర్శులుగా భీమేశ్, గడుదాస్ రవిచరణ్ తదితరులున్నారు.